# ఇరుకు మనసులు

మూడంతస్తుల మేడవుంది. దానికి ఎత్తైన ప్రహరీగోడ వుంది. దానికి ఆకుపచ్చ గేటు వుంది. ఆ గేటు లోపల రంగుల పూల మొక్కలున్నాయి. ఆ మూడంతస్తుల మేడలో ముప్పైగదులు వున్నా అవన్నీ వాడుకునేది ముచ్చటగా ముగ్గురే. యజమాని జగన్నాధం, ఇల్లాలు కామేశ్వరీ. వారి యేకైక పుత్రుడు ఆనందూ.

యీ ముగ్గురికి మూడంతస్తులు చాలక మరో రెండంతస్తులు పెంచి కట్టుకోవాలని కామేశ్వరి కలలు కంటోంది. యింక జగన్నాధం ప్లాన్లు గీయిస్తూన్నాడు. ఆ మేడగేటుముందు 70 యేళ్ల పైబడ్డ అతనికి ఆహ్లాదం కలిగించింది. పద్మా, ఆనందరావూ అలాగ పాలూ, నీళ్ళా లాగ కలిసి పోవటం కృష్ణమూర్తికి ఆనందాన్నీ, సీతమ్మకి సంతృప్తినీ కలిగించాయి.

వాళ్ళగురించే ఆనందరావు రెండు రోజులు సెలవుపెట్టాడు.

ఆ మూడోనాడు ఆనందరావు తల్లికి చెప్పాడు, "నేను రేపే వైజాగ్ టూరు మీద వెళ్తున్నాను, అర్జంటు పని." అని

"మంచిది, మామయ్య కూడా పెళ్ళి పోవాలంటున్నాడు. ఈ వేసవిలోనే పెళ్ళి అవాలని తొందరపెట్తున్నాడు. నీ నిర్ణయం చెప్పు మరి. ఏర్పాట్లు చేసుకోవటానికి వాళ్ళకి టైము కావాలిగదా", అంది సీతమ్మ.

"తప్పదా?"

"తప్పదు మరి."

"సరే, రాగిణిని నీ కోడలుగా సెలక్టు చేసాను. ఆ సంగతే మామయ్యతో చెప్పు."

సీతమ్మ తెల్లబోయింది, "అదేమిట్రా? బంగారు బొమ్మ పద్మని కాదని " ఆనందరావు నవ్వి అన్నాడు "పద్మ బంగారు బొమ్మ అన్న మాట నిజమేనమ్మా, కాని రాగిణి అందాల బొమ్మ అని నా కన్పించింది. కనపడని రాగిణి అందాలు నాకు ఆమె ప్రవర్తనలో కన్పించాయి. నెమ్మది, అణకువ, పొదుపు - ఇవే నేను ఈ ఇంటి కోడలికి కావాలని కోరుకున్నవి." సీతమ్మ కాదనలేక ఆలోచనలో పడింది.

ఆనందరావు వైజాగు వెళ్ళిపోగానే ఈ సంగతి కృష్ణమూర్తి చెవిన వేసింది సీతమ్మ.

కృష్ణమూర్తి తెల్లబోయి "అలాగా" అన్నాడు. ఆశ్చర్యాన్ని అణచుకోలేక పోయాడు.

ఇంకా-పద్మ అందమయిన కలలు కంటూనే వుంది. ఈ ఊరు వచ్చాక "ఆ" కలలకి నాయకుడు ఆనందరావే అయాడు. రాగిణి అయితే కలల జోలికి పోలేదు కాని సమీప భవిష్యత్తులో ఆ కలలే ఆమెకోసం కాచుకుని వున్నాయి. ఆనందరావు సెలక్షన్ సంగతి ఆ ఇద్దరికీ ఇంకా ముసలాయన నిల్చున్నాడు. బస్సులో యిరవై మైళ్ల ప్రయాణంచేసి రావటం వల్ల బట్టలు మాసివున్నాయి చెమటకి చొక్కా సగంపైగా తడిసివుంది. బట్టతలా, కళ్ళజోడూ చేతిలో చిరుగుల గొడుగూ అనుభవాలూ అచ్చంగా పల్లెటూరి రైతులా వున్నాడు. ఆయన చేతిని గట్టిగా పట్టుకుని ఓ పది హేనేళ్ళ కుర్రాడు నీలం నిక్కరూ, నల్లచొక్కా తొడుక్కుని సగం చిరిగిన చేతిసంచినీ దానిలో వున్న మరో జత బట్టలనీ అపురూపదంగా పట్టుకుని ఆ మేడవైపు తదేకంగా చూస్తూ బస్తీముఖం యెరుగని వెర్రివెంగళాయిలా నిల్చున్నాడు తాతగారి చెయ్యి వదిలితే తనెక్కడ తప్పిపోతానో అన్న భయం అతని కళ్ళలో కన్పిస్తోంది. బుద్ధితెలిసిన తర్వాత యిలాంటి బస్తీ చూడటం యిదే మొదటి సారి కావటంవల్ల యెక్కడ 'ఆటో' హారన్ విన్నా రిక్షా గంట మోగినాతన మీదే అవన్నీ వచ్చి పడిపోతూన్నంతగా కంగారు

పడిపోతూ తాతగారి చెయ్యి యింకా యింకా గట్టిగా పట్టేసుకున్నాడు. యిక్కడ యింత పెద్ద మేడని చూసి మరీ కంగారుపడిపోతూ తాతగారి వెనక నీడలా నడుస్తూ ప్రహరీగేటుదాటి లోపలికి అడుగు పెట్టబోయాడు. అంతే, యింతలో సివంగిలావున్న కుక్క భౌభౌ మంటూ మొరిగేసరికి తాతయ్యని అమాంతం పదిగజాల వెనక్కి లాక్కు పోయాడు.

"అబ్బబ్బ! శ్యాం, వుండరా. భయం లేదు. అది మొరిగినా కరవదు. యినపగొలుసుతో కట్టేసేవుంటారు" అంటూ శ్యాం చెయ్యి పట్టుకుని అంత వేగంగానూ ముందుకి లాక్కు వచ్చాడు ముసలాయన.

"ఏయ్! లోపలికి వస్తున్నావు, ఆయ్యగారి చుట్టంలా! ఎవరేంటి నువ్వు?" తోటమాలి దర్పంగా అడిగాడు మొక్కల మధ్యనించే.

"కామేశ్వరి కావాలి."

'యేటి!' పేదవాడైన ముసలాడు యే బిచ్చగాడో అనుకుంటూనే పరిహాసంగా అడిగాడు.

'యీ యింటి యజమానురాలైన కామేశ్వరి కావాలి, విన్పించిందా!'

శ్యాం తాతగారి చెయ్యిపట్టుకుని కుక్కవంక భయంగా చూస్తున్నాడు, ఆది యే క్షణాన ఆ గొలుసును తెంపుకుని వచ్చి మీదపడిపోతుందో అన్నట్లుగా.

శ్యాం భయం చూస్తుంటే సరదాగావుంది తోటమాలికి. ఒక్కసారి కుక్కని వదిలి తమాషా చూద్దాం అన్పిస్తోంది కానీ యీ ముసలాయన్ని చూస్తే మాత్రం అది చేసేందుకు భయంగావుంది. తను యీ బంగళాలో ఉద్యోగం చాలా యేళ్ళుగా చేస్తున్నాడు. మాలాంటి అతిసామాన్యులు యెవరూ కామేశ్వరిని 'గారు' అనకుండా 'కావాలి' అని రాలేదు అందుకే కాస్త ఆశ్చర్యం పడినా అయినా మనకెందుకులే అనుకుని చేతులు కట్టుక్కుంటూ 'యిక్కడే నిల్చోండి. చెప్పివస్తా' అంటూ వరండా దాటి లోపలికి వెళ్ళాడు. "ఎవరురా వీరన్నా?" కామేశ్వరి గొంతు ఖంగ్ మంది.

"ఎవరో ముసలాయన వచ్చాడు. మీరే కావాలంటున్నాడు."

"అబ్బబ్బ! అడుక్కునే ప్రతివెధవకి అమ్మగారు కావాలనటం అల వాటు అయి పోయింది. చూడూ రోజూ అందరికీ పంచేందుకు చిల్లర పెట్టిన స్టీలుగిన్నెలోవి రెండుపైసలు వేసి పంపు. పాపం యెవరో వస్తూ వుంటారు మరి, వాళ్ళని వట్టిచేతులతో పంపితే మనకి కలిసిరాదు అనీ అలా దానం చేస్తూండ మనీ ఆ మధ్య పాదపూజ చేయించుకు వెళ్ళిన పార్వతీ అమ్మ వారు చెప్పారు మరి. ఆవిడ మాటని ఎలా తీసేస్తాం గనుక. వెళ్ళు వేసి పంపేసెయ్యి."

వీరన్న పైసలు పట్టుకు వస్తున్నాడు. కానీ కామేశ్వరి అన్న మాట లన్నీ విన్న ముసలాయన బైటనే నిలవక గబగబా వరండా దాటి లోపలికి వస్తూ 'కావుడూ! నేనమ్మా వచ్చిందీ' అన్నాడు కాస్త గట్టిగా.

కావుడూ.... కామేశ్వరమ్మ ముఖం నల్లబడింది. యీ పేరుతో తనని పిల్చే ముసలిముండావాడు ఒక్కడే, ఆయ నీ మధ్య పదిహేనేళ్లుగా యీ యింట్లో కాలు పెట్టలేదు. మరీ ముసలా డెవరు, అనుకుంటూ పట్టుచీరె పైట సర్దుకుంటూ యివతలకి వచ్చింది. యెనిమిది లక్షలకి అధికారిణి కామేశ్వరి. వచ్చి ముసలాయన్ని, ఆయన చేరని పట్టుకుని కొత్త ప్రపం చాన్ని చూస్తున్నట్లుగా నిల్చున్న 'శ్యాం'నీ మార్చి మార్చి చూసింది.

"ఏమ్మా గుర్తించలేదూ!" ముసలాయన నవ్వు ముఖాన పులుముని అన్నాడు. "ఆ....నిన్ను గుర్తించాను కానీ....యీ సమ్మర్ క్రాపు గానినే...." సోఫాదిండ్లని ఆనుకుని కూర్చుంటు అంది. అంతలోనే మళ్ళీ లోపలికి చూస్తూ.

"ఒరే వీరన్నా కాసిన్ని మంచినీళ్ళు పట్టుకురా! యిదిగో యిత్తడి గ్లాసుకో పట్టుకురా" అని చెప్పి యిటు తిరిగింది.

"కూర్చోండి బాబాయ్! అనటం తడవుగా ముసలాయన అక్కడే వున్న సోఫాలో కూర్చోబోతుంటే,

"అహ అక్కడ కొయ్యకుర్చీ లేదూ దానిమీద...."చేత్తో చూపింది.

ముసలాయన టక్కున నిలబడి పోయాడు అసలు కూర్చోబుద్ధి కావటం లేదు. కానీ కామేశ్వరితో కాస్త మితంగా మాట్లాడవల్సిన పని వుండిపోవటంతో యిప్పుడు మర్యాద అన్నమాట పట్టించుకోకూడదు అనుకుని అలాగే ఆ పెద్ద హాలులో ఓ మూలనున్న కొయ్య కుర్చీలో కూర్చున్నాడు. శ్యాం కూర్చునే చోటు తెలియక తాతగారిదగ్గరే నిల్చున్నాడు. లావుగా పొట్టిగా వున్న కామేశ్వంవైపు కళ్లు అప్పగించి చూస్తున్నాడు. ఆవిడ రవ్వల ముక్కుపుడకనీ, వజ్రాల దుద్దులనీ చూస్తు తాతగారు మాట్లాడే మాటలు పట్టించుకోవటం మానేశాడు.

వీరన్న మంచినీళ్లు తెచ్చియిచ్చాడు. తాతగారు ఒక గ్లాసు తీసుకుని, శ్యాంకి ఒక గ్లాసు అందించాడు. మంచినీళ్ళు తాగి శ్యాం చేతిలోని గ్లాసు కూడా తను తీసుకుని వీరన్నకి అందించాడు. వీరన్న అక్కడనించి వెళ్ళి పోయాడు.

శ్యాం ముసలాయన కుర్చీని పట్టుకుని నిల్చుని ఆ హాలుని చూస్తున్నాడు. గోడకున్న రంగునీ అక్కడక్కడా తగిలించివున్న ప్రకృతి దృశ్యాలున్న ఫోటోలనీ చూస్తున్నాడు. ఒక ఫోటోలో పడవ నిండుగా ప్రవహించే కాలువలో ప్రయాణిస్తోంది తెరచాపతో. ఆ పడవలో అందమైన అమ్మాయి చుక్కాని దగ్గర కూర్చున్న అందమైన యువకుడి ముఖంలోకి చూస్తువుంది. ఆ పడవ నీళ్ళలో వేగంగా వెళ్ళిపోతున్నట్లు అన్పిస్తోంది శ్యాంకి. వళ్లు తూలినట్లయి అరె ఆ ఫోటోలోకి చూస్తుంటే మా వూరి కాలవ గుర్తుకి వచ్చింది. అనుకుంటూ నవ్వుకోబోయి కామేశ్వరి మాటలు విన్పించి ఆగిపోయి యిటు వైపు ముఖం తిప్పాడు.

"కావుడూ నీ కొడుకు బాగున్నాడా? అల్లుడి ఆరోగ్యం యెలా వుందమ్మా?"

"అందరం బాగానే వున్నాం కానీ యింతకీ ఆ అబ్బాయి ఎవరో చెప్పావుకావు."

"ఔనుకదూ! అసలు సంగతి మర్చే పోయాను. వీను యెవరంటే నీ చిన్నప్పుడు చెట్టెక్కి జామకాయలు కోసిపెట్టేవాడు, పొలంవెళ్ళి తాటి ముంజలు తెచ్చియిచ్చేవాడు, ఆ తర్వాత నీ పెళ్ళికి యెంతో నాకు సాయం చేశాడు గుర్తుందా?"

"లేదు."

"లేదూ! రాముడన్నయ్యమ్మా! నా అక్క కొడుకు."

"ఊ! అయితే?"

"వీడూ వాడి కొడుకు. పేరు మేఘశ్యాం. 'శ్యాం' అంటూ పిలుస్తాం అందరం. వీడు పుట్టగానే తల్లి పోయింది. అయినా యిన్నేళ్ళూ వీడిని తల్లీ తండ్రీ తనేఅయి పెంచి పెద్దచేసుకుని చదివించు కుంటున్నాడు. కానీ యీ మధ్యనే పడవ ప్రమాదంలో రాము మరణించాడు. వీడికి దిక్కు లేకుండా పోయింది.

"అలాగా! పాపం! అయినా యిలాంటి దిక్కులేనివాళ్లు యివాలా రేపూ చాలామందే కన్పిస్తున్నారు." కామేశ్వరి పొడిగా అంది. ముసలాయన మనస్సు చివుక్కుమంది. కానీ దాదాపు యిరవైయేళ్ళ క్రితం జరిగిన సంఘటనలు గుర్తుకువచ్చాయి. అప్పుడు యీ కామేశ్వరి తలిదండ్రులని పోగొట్టుకుని దగ్గరకుతీసే దిక్కులేక యేడుస్తుంటే చుట్టరికంకూడా లేకున్నా కేవలం ఆడపిల్ల అనే జాలితో తను దగ్గరికి తీసుకుని పెంచి పెద్దచేశాడు. విద్యాబుద్ధులు చెప్పించాడు. తనకి మరో నలుగురు పిల్లలున్నా కూడా, యీ కామేశ్వరికి మంచి సంబంధం చూసి తన నోటికాడికి అన్నాన్నిచ్చే మాగాణీ పొలం అమ్మి పెళ్ళిచేశాడు. యెందుకు? పెంచిన మమకారంవల్ల! యే దారేపోయే దానయ్యకి లుచ్చి ముడిపెట్టలేదు యెందుకు! కామేశ్వరి సుఖంగా బ్రతకాలి అన్న తాపత్రయంతో. యీ పెళ్ళికి 'ఆ పొలం అమ్మటానికి వీల్లేదు' అని భార్యా పిల్లలూ అడ్డుచెప్పినా వినలేదు. ఎందుకు! తను ఒక మంచిపని చేస్తున్నానన్న నమ్మకం వున్నందుకు. తనెంత భాగ్యవంతుడు కాకున్నా వార్ధక్యంలో యేం మిగుల్చుకోలేక

పోయినా ఒక్కరోజూ బాధపడలేదు. కామేశ్వరి పెళ్ళి లక్షణంగా జరిపించినా అలకపాన్పు మీద అల్లుడికి 'రాలీసైకిల్' అడిగితే'

'నాకింక అంత శక్తి లేదు' అని చెప్పినందుకు కాపురానికి వెళ్ళిన కామేశ్వరిని 'యింక పంపం' అని బిగదీశారు. ఒకటికి రెండుసార్లు ముసలాయన వచ్చి అడిగినా జగన్నాథం యెదురుగానే అతని తల్లి అవమానపర్చి పంపింది. అప్పటికి జగన్నాథానికి మూడుగదుల అద్దెయిల్లు మాత్రమే వుండేది.

జగన్నాథం తల్లి పోయినతర్వాత మళ్ళీ వచ్చి అడిగాము కామేశ్వరిని "చిన్నప్పుడు పెరిగిన ఆ నట్టింట్లో నాలుగు రోజులు వుండి వద్దువుగాని రామ్మా" అని కామేశ్వరి తల అడ్డంగా ఊపుతూ "చూడు బాబాయ్, నా మగడు యేమంత కోరరాని కోరిక కోరారనీ. యేదో చిన్నతనం గనుక ముచ్చటపడి ఓ సైకిల్ కావాలని అడిగారు. అది గ్రహించావా నువ్వు. 'కాదు' అనేశావు. ఆయన సున్నితమైన మనస్సు యెంత గాయపడిందో నీకేంతెల్సు! నాకు తెల్సు! అందుకే యీ జన్మలో నీ యింట్లో కాలుపెట్టను. నీవుగనుక నే రానన్నా వూరుకున్నావు కానీ కన్నతండ్రి అయితే ఆడపిల్లని యిలా వదిలి వూరుకునే వాడా!" అని కన్నీళ్ళు పెట్టుకుంది.

దాదాపు పదిహేనేళ్ళ క్రితం మౌనంగా వెళ్ళిపోయిన ముసలాయన తిరిగి యివాళ కామేశ్వరి గడపలో కాలుపెట్టాడు. ఎందుకు! తనకోసం కాదు అక్క మనుమడైన యీ శ్యాంకోసం. తన కొడుకులు అందరూ యెదుగూ బొదుగూలేని సంసారాల్లో వుండిపోవటం వల్ల యీ కామేశ్వరి యీ ఒక్క కుర్రాడికీ కాస్త ఆశ్రయం యిచ్చి వీడిని అభివృద్ధిలోకి తేవటానికి సాయపడక పోతుందా! అన్న ఆశతో యింతదూరం వచ్చాడు.

జగన్నాథం తెలివితేటలతో సంపాదించి దాన్ని వ్యాపారంలోపెట్టి చాలా అభివృద్ధి చేసుకున్నందుకు ముసలాయనకి చాలా సంతోషమే వేసింది. కానీ కామేశ్వరిలో ప్రేమాభిమానాలు కన్పించనందుకు బాధా వేస్తోంది. అంతలోనే కోపమూ వస్తోంది. అయినా శాంతం తెచ్చుకుంటు తను వచ్చిన విషయం సూటిగా మూడుముక్కల్లో చెప్పేశాడు.

"అమ్మా కామేశ్వరీ! యీ దిక్కు లేని దురదృష్టవంతుడిని నీ నీడన వుంచుకుని ఒక దారి చెయ్యి. కొంత చదువుంది. యేదో ఓ దారి చూపావంటే ఆ దారిన ముందుకు పోవటం వాడి అదృష్టమూ తెలివీ మీద ఆధారపడి వుంటుంది. కాని ఆ కాస్త అవకాశం మాత్రం నువ్వు కల్పించు. యిది అడగటానికే యింతదూరం వచ్చాను."

కామేశ్వరి ముఖం క్షణం చిటపట లాడింది. అంతలోనే నవ్వు ముఖాన పులుముకుంది. "బాబాయ్! నే తల్చుకుంటే అదెంతభాగ్యం కాని చూడు యిప్పటికే యీ యింట్లో నౌకర్లు నలుగురున్నారు. ముగ్గురు డ్రైవర్లున్నారు. యిద్దరు వంటవాళ్ళున్నారు. అయిదుగురు తోటమాలీలున్నారు. ఆరు కుక్కలున్నాయి. నాలుగు కుందేళ్ళు వున్నాయి. రెండు రామచిలుకలున్నాయి. మరి నువ్వే చెప్పు. నేనేం ఆసరా యివ్వగలను."

ముసలాయన ముఖం క్షణం వెల వెల పోయింది, తర్వాత కామేశ్వరి అభిప్రాయం అర్థమైంది. 'హుఁ' అనుకున్నా పైకి శాంతంగా అన్నాడు.

"చూడమ్మా! పదిమందికి ఆసరా యివ్వగలవు అనడంలో నీ వుద్దేశ్యం శ్యాంని నీ నౌకరుగా యీ యింట్లో చోటు యివ్వమని కాదు అదే కావాలంటే నేనింతదూరం రానక్కరలేదు."

"మరి?" అర్థంకానట్లు చూస్తోంది కామేశ్వరి. ఆ యిద్దరినీ చూస్తున్నాడు శ్యాం బట్టలసంచీ పట్టుకుని.

"కాపుడూ! యే మనిషికైనా కాలం అంతా ఒక్కలా గడవదు. తల్లిదండ్రుల అండన వుండవల్సిన సమయంలో మరొకరి మీద ఆధారపడవలిసిరావటం శ్యాం దురదృష్టమే అనుకో. కాని జీవితంలో కొంత స్థిరత్వాన్ని సంపాదించుకున్న నీలాంటివాళ్లు యిలాంటివాళ్ళని ఆదుకోవటంలో ఆనందం లభిస్తుంది. వీడు అభివృద్ధిలోకి రావటానికి నీ చెయ్యి ఆసరా యిస్తే నేనేకాదు ఆ దేవుడుకూడా సంతోషిస్తాడు. కాదంటావా?"

"అని ఎలా అంటాను కానీ బాబాయ్, మేం ప్రస్తుతం యిక్కడ

వుండటం లేదు. విదేశాలు విళ్ళిరావాలని అనుకుంటున్నాం."

"అలాగా తల్లీ ! చాలా సంతోషం. కానీ యెప్పుడు వెళ్ళాలనుకుంటున్నారు."

"త్వరలో."

"పోనీ తిరిగి యెన్నాళ్ళలో వస్తారు?" నిరాశగా అన్నాడు.

"తెలియదు."

"పోనీనెలలా సంవత్సరాలా పట్టేది."

"అదీ తెలియదు బాబాయ్! చూడు మీ అల్లుడికి క్షణం తీరుబడి ఉండదు. ఉన్నా నాతో మాట్లాడే అంత అవకాశం అసలు వుండదు. ఉన్నా అప్పుడు యెవరో ఒకరు వచ్చి యిది కావాలనీ అదికావాలనీ ఆయన్ని వేధించుకు తింటారు. పాపం ఆయన్ని చూస్తూంటే జాలి ముంచుకువస్తుంది. అన్నంతినే తీరికవుండదు. కాఫీ తాగే సావధానం వుండదు. యివన్నీ కలిపిస్తే ఆరోగ్యం బాగుండదు అదీ బాగుంటే వ్యాపారం విషయాల్లో లాభ నష్టాలతో మనశ్శాంతి అసలే వుండదు అవన్నీ చూస్తున్న నాకు మతి వుండటం లేదు. యేంచెప్పను నా కష్టాలు. యెవరు వింటారు మా బాధలు. 'మీకు యిబ్బందిగా' అని అసూయతో కళ్ళల్లో నిప్పులు పోసుకునేవాళ్ళే కన్పిస్తున్నారు కానీ 'అయ్యోపాపం' అనే ఒక్క సానుభూతి వాక్యం పలికేవాడు ఒక్కడంటే ఒక్కడు కన్పించటంలేదు."

ముసలాయనకి, కామేశ్వరి చివరి మాటలేం చెవికి యెక్కలేదు. కానీ ఆవిడ చెప్పిన యిబ్బందులూ' బాధలూ మాత్రం అసలైన సమస్యలేనా అనిపించి "కాపుడూ అయితే యింత డబ్బు సంపాదించుకున్న మీకు లేనిదేమిటీ? కావల్సింది యేమిటీ?" అన్నాడు చికాగుగా.

"అదే అర్థమై చావటంలేదు. అర్థమైతే ఆదెక్కడున్నా ఖరీదైనా కొనుక్కోలేకపోయానా!" దిగులుగా అంది కామేశ్వరి ముఖం పైటకొంగుతో తుడుచుకుంటూ 'పలుష్....అబ్బ ...' అంటూ ఆపసోపాలు పడిపోతూ.

"యింతకీ నీ కొడుకెక్కడ?"

"హైదరాబాదులో చదువుకుంటున్నాడు."

"పదేళ్ళ వెధవని అంతదూరంలో వుంచారా!"

"ఆ ... అప్పుడప్పుడు వస్తుంటాడు గానీ నా అశాంతి పట్టించుకున్నట్లు లేదు నువ్వు."

ముసలాయన కామేశ్వరిని నిశితంగా పరీక్షించాడు. యీ అమ్మాయి చిన్నప్పుడు తను పెంచిన కామేశ్వరి కాదు అన్న సత్యం పూర్తిగా అర్థమయ్యే సరికి కుర్చీలోంచి లేచాడు. 'శ్యాం' చెయ్యి పట్టుకుని ఓ అడుగు వేస్తు.

"కాపురూ నీకు లేనిదేమిటో నాకు తెలిసింది" అన్నాడు శాంతంగా.

"నిజంగా! చెప్పు బాబాయ్! త్వరగా చెప్పు."

"మీకు లేనిదీ మాకు వున్నదీ ఒకే ఒక్కటి! అదే మనసు. డబ్బు పోగు చేసుకోవాలన్న దాహంతో తపనతో మనస్సుని యిరుకుగా మార్చుకుంటున్నారు. కానీ మేం .." అని యింకా యేదో చెప్పబోయి యిహ లాభంలేదు. నా మాటలు విని అర్థంచేసుకోగల స్థితిలో లేదు కామేశ్వరి అనుకుని.

"వెళ్ళివస్తాం అమ్మా, అల్లుడికి ఆశీస్సులు అందించు." అంటూ శ్యాం వెంట బయటకి వచ్చేశాడు.

"తాతయ్యా మనం యిప్పుడు యెక్కడికి వెడదాం?" అంటూన్న శ్యాంని ఆత్మీయంగా దగ్గరికి తీసుకుని ఆలోచిస్తు అడుగులు వేస్తున్నాడు. ముసలాయన.

శ్యాంకి భయంవేస్తోంది. యిక్కడికి వచ్చేముందు యెంతో ఆశతో వచ్చాడు. ఆ మూడంతస్తుల మేడలోని ఒక స్త్రీ మూర్తి తనని దగ్గరగా తీసుకుని 'శ్యాం నీకు నే వున్నాగా మరేం భయపడకు' అంటుందని అను

కున్నాడు. ఆవిడ ఓ చిన్న వుద్యోగం యిప్పిస్తుందనీ దానిలో చేరి తను అలా అలా పైకిపోతాడనీ కలలు కన్నాడు. కానీ యిక్కడ తను అనుకున్నట్లుగా జరగలేదు.

"తాతయ్యా! మనం యెక్కడికి వెళ్ళాలి?" మళ్ళీ అడిగాడు ముసలాయన మౌనంగా నడుస్తున్నాడు. జనం గుంపులు గుంపులుగా నడిచే ఆ రోడ్డు మీద ముసలాయన పరధ్యానంగా నడుస్తున్నాడు. స్పీడుగా వస్తున్న సైకిల్ కిందపడ్డాడు. కానీ దెబ్బలు అంతగా తగల్లేదు.

"అయ్యో.... తాతగారు, తాతగారు" జనం పోగయ్యారు. సైకిలతను గభాలున లేచి ముసలాయన్ని పరీక్షగా చూస్తు "అరే.... బాబాయిగారూ.... మీరా! యీ వూరు యెందుకు వచ్చారు? యెప్పుడొచ్చారు?" ప్రశ్నలన్నీ ఒకేసారి వేసేశాడు. ముప్పయియేళ్లు పైబడ్డ సైకిల్ ఆయన.

"ఎవరు నువ్వు? గుర్తుపట్టలేక పోతున్నాను." వంటికి అంటిన మట్టి దులుపుకుంటూ పరీక్షగా చూస్తూ అడిగాడు.

"నేను రామ్మూర్తిని బాబాయిగారూ... మీ యింట్లో వారాలు చేసుకుని చదువుకున్నాను. మీరు మర్చిపోయినా నేను మర్చిపోలేదు.... రండి యీ దగ్గరలోనేవుంది, మా యిల్లు. మిమ్మల్ని చూశాను చాలా సంవత్సరాల తర్వాత. నాకు చాలా సంతోషంగా వుందండి."

"అలాగా, యిప్పుడు గుర్తుకి వచ్చావు రామ్మూర్తీ. యింతకీ యిక్కడ యేం చేస్తున్నావు?"

"దినపత్రికలూ, వార, మాసపత్రికలూ యేజన్సీ తీసుకున్నానండి .... నా దగ్గర మరో యిద్దరు అబ్బాయిలు కూడా పనిచేస్తున్నారు. తగిన ఫలితం వస్తుంది కానీ చాలా కష్టపడాలి... యింతకీ యీ అబ్బాయి యెవరూ?"

శ్యాం వివరాలు చెప్పి "చూడు రామూర్తీ యివాళ వీడికి ఓ దారి చూపగల వారికోసం వెతుక్కుంటూ వచ్చాను, కానీ లాభంలేక తిరిగి

వెళ్ళి పోతున్నాను.''

"అయ్యో అలాగా ...'' నొచ్చుకున్నాడు రామూర్తి. శ్యాం తాత గారూ ఆయన మాట్లాడేది అంతా వింటున్నాడు.

"రండి యిదే మా యిల్లు.... చూడండి బాబాయిగారూ.... మా యిల్లు చాలా చిన్నది.'' అంటూ సిగ్గుపడిపోయాడు. ముసలాయన అతని భుజం తడుతూ మరేం ఫర్లేదు. నువ్వు నీ కాళ్ళమీద నిలవటం కాక మరిద్దరికి ఉపాధి కల్పిస్తున్నావు. యిందుకు చాలా సంతోషంగా వుంది బాబూ?''

"కమలా.... ఓ కమలా''.... పిల్చాడు భార్యని. ఆమె వచ్చి భర్త పరిచయం చేస్తూ చెప్పిందంతావిని "తాతగారూ.... యెప్పుడూ మీ పేరే తల్చుకుంటుంటాం మేం. మీరు పెట్టిన బిక్ష యిది మాకు'' అంది కృతజ్ఞగా.

"అబ్బే ...అలా అనకమ్మా... యేదో.... మాతోపాటు పచ్చడిమెతుకులు పెట్టాం అంతేగా....'' అన్నారు అభిమానపడిపోతూ. కమల చకచకా వంటచేసి భోజనం పెట్టింది. కొసరి కొసరి వడ్డించింది. తాత గారు కాస్సేపు విశ్రాంతి తీసుకుని

"యింక వెళ్ళివస్తాను బాబూ ...'' అంటూ, 'శ్యాంకి నువ్వేదైనా సాయం చేయగలవా అని అడగాలని వున్నా అడగలేక వెళ్ళివస్తాను' అంటూ లేచారు.

రామ్మూర్తి ముసలాయనకి నమస్కారం చేస్తూ,

"బాబాయిగారూ! యీ శ్యాంని నా దగ్గర వదలండి. ఒక వంద రూపాయలు సంపాదించుకునేలా పని అప్పగిస్తాను ఆ తర్వాత అతని సామర్థాన్ని బట్టి.... యింకా యింకా.... అవకాశాలు కలగవచ్చు.... నే నింతకిమించి పెద్దగా సాయపడలేను ... అతనికి యిష్టం అయితే నాదగ్గర వదిలి వెళ్ళండి.... నా బిడ్డలా చూసుకుంటాను.

"రామ్మూర్తీ!...." ముసలాయన కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి

"అలాగే బాబూ, అలాగే.... అలాగే చెయ్యి," అని చెప్పి "శ్యాం. .. నీ కిష్టమేనా?" అని అడిగాడు.

"వుంటాను తాతయ్యా." కమల ముఖంలోకి చూస్తూ వుండగలను అన్న ధీమాతో అన్నాడు.

"సరే.... చూడు నీకు బాగుంటేనే వుండు. మరి నే వెళ్ళివస్తా బాబూ రామ్మూర్తీ."

"వీరి యిల్లు చిన్నదే కానీ.... మనను పెద్దది. విశాలమైంది మనస్సు. చాలు. అదే చాలు దేవుడు నీకు మేలుచేస్తాడు."

వెళ్ళిపోయాడు ముసలాయన.

*　　　*　　　*

నాలుగు సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి. శ్యాం యిప్పుడు రామ్మూర్తికి కుడిభుజం. వ్యాపారం చాలా అభివృద్ధి చేస్తున్నారు యిద్దరూ కలిసి. మరో పదిమందికి పనికల్పించారు. అయితే వాళ్ళకోసం ఖర్చు చేసుకుంటున్నది చాలా తక్కువే.

ఒక రోజు దినపత్రికలోని వార్త చూశాడు శ్యాం.

ఆదాయంపన్ను శాఖ అధికారులు శ్రీమంతుడైన జగన్నాధం అయిదంతస్తుల భవనంమీద దాడిచేసి లెక్కల్లో చూపని అయిదు లక్షల డబ్బూ బంగారం వగైరా పట్టుకున్నారు. 'శ్యాం' ఆ వార్తని మళ్ళీ మళ్ళీ చదువుతున్నాడు.

అంత డబ్బు యెవరికోసం పోగుచేసినట్లు? పోగుచేసి యేం సుఖం అనుభవించినట్లు? మాటి మాటికి తననాడు చూసిన కామేశ్వరే గుర్తుకు వస్తోంది. మనిషికి శాంతి యెక్కడ లభిస్తుందో అర్థంచేసుకుంటే యిలా కారేమో మనుషులు. తాతయ్య అన్నమాటలే గుర్తుకి వస్తుంటాయి శ్యాంకి. యిల్లు యిరుకు అయినా మరేం ఫర్లేదు. మనస్సులు విశాలం చేసుకోండి."

(యువ మాస పత్రిక)